

# అక్కడే ఆగక

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

**(గత సంచిక తరువాయి)**

"**సరే. వెళ్ళి నీకోసం గీజర్ వేస్తాను**. పైన రెండు, కింద ఓ బెడ్ రూం. మొత్తం మూడు బెడ్‌రూములు. నా పక్క బెడ్‌రూం, కింద దానికన్నా బావుంటుంది. నీకు ఏది నచ్చుతుందో చూసి ఏది బావుంటే అది తీసుకో."

బాత్‌రూములో షవర్ టేప్స్‌ని ఎలా ఆపరేట్ చేయాలో బోధించింది.

"ఏదీ? ఓసారి వెయింగ్ మెషిన్ మీద నిలబడు" చైత్ర కోరింది.

చెల్లెలి బరువు చూసింది. ఎనభై మూడు కిలోలు.

"నీ వయసుకి, ఎత్తుకి ఉండాల్సిన బరువుకన్నా ఎంత బరువు ఉన్నావో తెలుసా? అది ఆరోగ్యానికి మంచిది కాదు." మందలింపుగా చెప్పింది.

చైత్ర వెంటనే ఫ్రిజ్‌కి మేగ్నెట్‌తో అతికించిన నోట్ పేడ్ మీద దాన్ని రాసి, తారీకు వేసొచ్చింది.

"నీకో ఆరోగ్య సూత్రం చెప్పనా?" అడిగింది.

ఆద్య మౌనంగా చూసింది.

చైత్ర ఓ ట్వైన్ దారం కత్తెరని తెచ్చి ఆద్య పాదాలనించి తలదాకా ఆ దారంతో ఎత్తుని కొలిచింది. పైన గుర్తుకి ముడేసి అక్కడ కత్తిరించింది. తర్వాత ఆ దారాన్ని ఆద్య నడుంచుట్టూ తిప్పి చెప్పింది.

"చూసావా? ఈ రెండు కొసలు కలుసుకుంటే నువ్వు సరైన బరువులో ఉన్నట్లు. రెండు కొసల మధ్య దూరం చాలా ఉంది. అది ఎక్స్‌ట్రా ఫేట్. అది లివర్, గుండె, పేంక్రియాస్‌లాంటి లోపలి ఆర్గాన్స్ చుట్టూ పేరుకుంటుంది. దానివల్ల బి.పి, డయాబెటిస్, గుండెమీద అధిక శ్రమపడి గుండె జబ్బు రావచ్చు. జస్ట్ ఐదు శాతం అదనపు బరువు తగ్గితే పొట్టలోని చాలా ఫేట్ కరుగుతుంది. తిను. కాని ఎక్సర్‌సైజ్ చెయ్యి. ఎక్సర్‌సైజ్ ఈజ్ ది మంత్రా. ఈ దారం డైనింగ్ టేబుల్ మీద గుర్తుగా ఉంచుకో. ఇక్కడ వీలైతే వాకింగ్ చెయ్యి. సేఫ్ కంట్రీ."

ఆద్య మాట్లాడలేదు.

"వీటిని చూసావా? సబ్బుతో నేనే వీటిని కార్వ్ చేసాను" అందంగా అలంకరించిన వివిధ రంగుల్లోని ఏనుగు, డ్రాగన్, కుందేలు, బఫూన్, సర్కస్ గుడారంలాంటి శిల్పాలని చూపించి చైత్ర చెప్పింది.

"ఎక్కడ నేర్చుకున్నావు?"

"యు ట్యూబ్ ట్యుటోరియల్స్‌లో సోప్ కార్వింగ్స్ ఫర్ కిడ్స్, స్నో కార్వింగ్స్ ఫర్ బిగినర్స్ అని సెర్చ్ చేస్తే కనిపిస్తుంది. తెలుగువాళ్ళు కళాప్రియులకన్నా తిండి ప్రియులని నాకు అనిపిస్తుంది. వంకాయ కూరకి లక్షల హిట్స్. తెలుగులో చెప్పిన ఇలాంటి వాటిని చాలా తక్కువమంది చూస్తారు. ఫస్ట్ థింగ్స్ ఫస్ట్. ముందు నీకు కాఫీ కలుపుతాను."

తనకిచ్చిన కాఫీ మగ్‌మీద ప్రింట్ చేసిన ఐ లవ్ పైథాగరస్ అనే పదాలని ఆద్య గమనించింది.

చైత్ర మగ్‌మీద 'సారీ ఫర్ వాట్ ఐ సెడ్ బిఫోర్ కాఫీ' అని ప్రింట్ చేసుంది.

ఆద్య కాళ్ళని సోఫామీద ఉంచుకుని ఆ గదిలో ఖరీదైన సోఫాలని, మధ్యలో గోడలేని వంటగదిని, అందులోని మైక్రోవేవ్ ఓవెన్, ఫ్రిజ్‌లని, షెల్ఫ్‌లని చూసింది. తల తిప్పి తన వెనక ఉన్న సిక్స్ సీటర్ డైనింగ్ టేబుల్‌ని చూసింది. టేకు చెక్కతో చేసిన అది పాలిష్ చేయబడి నిగనిగలాడుతోంది. చైత్ర తనకి అమెరికానించి ఘనాకి బదిలీ ఐందని చెప్పాక తల్లి అన్నమాటలు గుర్తొచ్చాయి.

"ఆఫ్రికా! ప్రపంచంలో నంబర్ ఒన్ దేశాల్లో ఒక దాంట్లోంచి డొక్కు దేశాల్లో ఓ దానికి వెళ్తున్నావన్నమాట" ఆవిడ అసంతృప్తిగా అడిగింది.

"అవును. అది నా ప్రయోజనానికే. అమెరికానించి ఆఫ్రికాకి వెళ్ళడానికి సాధారణంగా క్వాలిటీ ఆఫ్ లైఫ్‌ని కోల్పోతారని ఎవరూ ఒప్పుకోరు. అందుకని ఆఫ్రికాకి వెళ్ళేవాళ్ళకి చాలా ఇంసెంటివ్స్ ఇస్తారమ్మా. ఫ్రీ క్వార్టర్స్, ఫ్రీ వైఫై, ఫ్రీ ట్రాన్స్‌పోర్ట్ ఫ్రీ ఎలక్ట్రిసిటీ, ఫ్రీ హౌస్ మెయిడ్, ఫ్రీ మినరల్ వాటర్, ఫ్రీ ఫోన్, ఫ్రీ ప్రొటెక్షన్ కాబట్టి నాకు పెద్దగా ఇష్టంలేకపోయినా ఒప్పుకున్నాను. కేవలం భోజనం ఖర్చు మాత్రమే ఉంటుంది. జీతం కూడా రెండింతలు ఇస్తారు. అందువల్ల అక్కడ చాలా డబ్బు మిగులుతుంది. టేక్స్ కూడా పదమూడున్నర శాతమే. అమెరికాలో ముప్పై శాతం టేక్స్ చెల్లించాను. పైగా ఉద్యోగంలో ప్రమోషన్‌కి ఆఫ్రికా పోస్టింగ్ సహాయం చేస్తుంది. లైఫ్‌లో ఒకటి కోల్పోతేనే మరోటి వస్తుంది. ఫ్రాన్స్‌లో పనిచేసినప్పుడు నలభై ఐదు శాతం, నార్వేలో నలభై తొమ్మిది శాతం టేక్స్‌లు చెల్లించాను. ఆ దేశాల్లో పిల్లలకి స్కూల్ ఫీజ్ ఉండదు .కాని నేను బేచ్‌లర్ గర్ల్‌ని కాబట్టి ఆ బెనిఫిట్‌వల్ల నాకు ఉపయోగంలేదు. ఫ్రీ హెల్త్ కార్డ్ ఇచ్చారు. కాని ఎన్నడూ సిక్ కాలేదు" చైత్ర నచ్చ చెప్పింది.

చైత్ర అద్యకి ఆ ఇల్లంతా తిప్పి చూపించినప్పుడు అంత పెద్ద ఇంటిని ఎదురు చూడలేదు. ఆ డూప్లెక్స్ హౌస్ విస్తీర్ణం మూడువేల ఐదువందల చరపు అడుగులు. పాలరాతి మెట్లు. మహాగని కలపతో చేసి పాలిష్ చేసి తళతళ మెరిసే బేనిస్టర్. ఆద్య అక్క వెంట విశాలమైన హాల్లోని మెట్లెక్కి పైకెళ్ళింది. మూడు బెడ్‌రూములలో ఎ.సి మెషిన్స్. అన్నిటికీ అటాచ్డ్ బాత్‌రూంలు. మాస్టర్ బెడ్‌రూములో బాత్ టబ్. ఇంటి వెనక కాంపౌండ్‌లో స్విమ్మింగ్ పూల్. టెన్నిస్ కోర్ట్.

"అమెరికాలోని ఇళ్ళల్లో ఏ సౌకర్యాలుంటాయో సరిగ్గా అవన్నీ ఉండే ఇళ్ళనే ఆఫ్రికాలో మాకు ఇస్తూంటారు. ఈ ఇంటిని మా కంపెనీకి అద్దెకి ఇవ్వడానికి ప్రత్యేకంగా కట్టారు. ఈ దేశం ఎం.పి నే దీని ఓనర్."

వాటికోసం ప్రత్యేకంగా కట్టిన గదిలోకి తీసుకెళ్ళి వాషింగ్ మెషిన్, డ్రైయర్‌లని చూపించింది.

"విడిచిన బట్టలని ఈ బుట్టలో వెయ్యి. వీటిని ఎలా ఆపరేట్ చెయ్యాలో తెలుసా?" అడిగింది.

"తెలీదు"

"అదేమిటి? మనింట్లో వాషింగ్ మెషిన్ ఉందిగా?"

"అమ్మే దాన్ని వాడుతుంది."

"దేన్నైనా ఆపరేట్ చేయడం తెలుసుకుని ఉండటం మంచిది. ఇక్కడ ఇది మెయిడ్ డ్యూటీ. కాని తెలుసుకోవడం మంచిది. కింద ఈ గుండ్రటి మూత తెరచి బట్టలని ఇందులో వేసి మూత ముయ్యాలి. తర్వాత.. నేర్చుకోవడం ఎన్నడూ ఆపకు ఆద్యా. ఎందుకంటే జీవితం బోధించడం ఆపదు. కీప్ లెర్నింగ్."

మైక్రోవేవ్ ఓవెన్‌ని చూపించి దాన్ని ఎలా ఆపరేట్ చేయాలో బోధించింది.

"ఇందులో పొరపాటున కూడా మెటల్ వస్తువులు ఉంచకూడదు. నో స్టీల్ గిన్నె. నో స్టీల్ స్పూన్. లేదా ఓవెన్ పేలిపోవచ్చు. ఈ అలమారలోవే వాడు. ఇవన్నీ మైక్రోవేవ్ సేఫ్. గాజువేం వాడకు. అవి పగిలిపోతాయి."

ఆద్యతో దాన్ని ఒకటి రెండుసార్లు ఆపరేట్ చేయించాక చెప్పింది.

"గుడ్. నీళ్ళని కూడా నిమిషం నిమిషన్నరమించి కాచకూడదు. లేదా మైక్రోవేవ్ ఓవెన్లోంచి కాగిన నీళ్ళ గిన్నెని బయటకి తీయగానే వేడినీరు మొహం మీదకి చిందచ్చు. దీన్ని కేవలం రీహీటింగ్‌కే వాడతాను. అప్పడాలు నలభై క్షణాలు ఉంచితే చాలు. నెయ్యి తెచ్చావు కాబట్టి అది రాసుకుని తిను. కాఫీకి నీళ్ళని ఎలక్ట్రిక్ కెటిల్‌లో కాచుకో."

డబ్బాలకి రబ్బర్ బేండ్స్‌ని చూసి ఆద్య అడిగింది.

"ఇవెందుకు?"

"డబ్బాలో ఎంతదాకా సరుకు ఉందో తెలుసుకోడానికి బయట రబ్బర్ బేండ్‌ని చుట్టూ తొడుగుతాను. లోపలది తరిగినప్పుడల్లా రబ్బర్ బేండ్‌ని కిందకి కదుపుతూంటాను."

ఆద్య అరటిపళ్ళ ముచికలకి చుట్టిన బట్టని చూడటంతో చైత్ర చెప్పింది.

"ఇది నువ్వు కూడా గుర్తుంచుకుని, ఆచరించాల్సిన ఉపాయం. అరటిపళ్ళ ముచికల దగ్గర తడి బట్టని చుడితే వారం దాకా అవి పాడవకుండా ఉంటాయి."

టి.వి ఆన్ చేసి రిమోట్‌తో ఛానల్స్‌ని మార్చి మార్చి చూపిస్తూ చెప్పింది.

"ఇండియాలో నువ్వు ఏం ప్రోగ్రామ్స్ చూస్తావు?"

"సీరియల్స్, సినీ బేస్డ్ ప్రోగ్రాంలు."

"ఎలాంటివి?"

"ఆలీతో సరదాగా, జబర్దస్త్, బిగ్‌బాస్.."

"వార్తలు?"

"ఊహూ. నాన్నే చూస్తారవి."

"మన కేంద్ర హోం మినిస్టర్ ఎవరు?" చైత్ర కొద్దిక్షణాలాగి అడిగింది.

"తెలీదు."

"మన రాష్ట్రపతి?"

"తెలీదు."

"జి.డి.పి. అంటే తెలుసా?"

"ఊహు."

"ఇక్కడ తెలుగు ఛానల్స్ రావు. సౌత్ ఆఫ్రికన్, ఘానా, అమెరికన్, బ్రిటీష్, ఫ్రెంచ్, చైనీస్ ఛానల్స్ వస్తాయి. నీకు ఏది నచ్చితే అది పెట్టుకో. నా సజెషన్ ఉదయం పదకొండున్నరకి బిబిసిలో వచ్చే ప్రోగ్రామ్ చూడమని."

రిమోట్ ఇస్తూంటే ఆద్య తీసుకోకపోవడంతో చెప్పింది.

"నీకు ఏ ప్రోగ్రాం కావాలంటే అది పెట్టుకో. అంతర్జాతీయ సినిమాలు చూస్తే వివిధ ప్రాంతాల సంస్కృతులు తెలుస్తాయి." 'జస్ట్ ఫర్ లాఫ్స్' కామెడీ ప్రోగ్రాం వచ్చే ఛానల్ని పెట్టింది. కొద్దిసేపట్లో ఆద్య అందులో లీనమై నవ్వసాగింది.

"స్నాక్‌గా మేగీ, మేకరోని, ఎగ్ తిందాం. ఓసారి ఇట్రా."

ఆద్యనించి జవాబు ఆశించని చైత్ర మేకరోని, ఎగ్‌ని ఇండక్షన్ స్టవ్ మీద పెట్టి దగ్గరకి వచ్చిన ఆద్యకి స్టవ్ వంక చూపిస్తూ చెప్పింది.

"ఇది ఇండక్షన్ ఎలక్ట్రిక్ స్టవ్. గేస్ స్టవ్ కాదు. అన్ని గిన్నెలూ ఈ స్టవ్‌కి పనికిరావు. ఇండక్షన్ ఫ్రెండ్లీ గిన్నెలనే వాడాలి. ఇక్కడ ఉన్నవన్నీ అవే."

తర్వాత కిటికీ తెరలు వేస్తూ చెప్పింది.

"కిటికీ తలుపులని కంపల్సరీగా వేసి ఉంచాలి. ఇది ఆఫ్రికా. ఈ ఖండంలో మలేరియా దోమలు ఎక్కువ. తలుపులు తీసుంటే అవి ఇంట్లోకి వస్తాయి. అవి కుడితే ప్రమాదం. ఇక్కడ చాలామంది మలేరియాతో పోతూంటారు. ఓ రకం దోమ కుడితే వచ్చే ప్రాణాంతక మలేరియాకి మందు లేదు. ఇక ఏ డాక్టరూ కాపాడలేడు. సో, బి వెరీ కేర్‌ఫుల్. ఒక్క అదే కాదు. ప్రపంచంలో మరెక్కడా లేని ఎల్లో ఫీవర్‌లాంటి ఎన్నో విషజ్వరాలు ఆఫ్రికాలో ఉన్నాయి."

ఓ కేన్‌ని చూపించి చెప్పింది.

"ఇది మస్కిటో రెపెలెంట్. బయటకి వెళ్ళినప్పుడల్లా ఎక్స్‌పోజ్ అయ్యే చర్మానికి దీన్ని రాసుకుని వెళ్ళాలి. దీని వాసనకి దోమలు మీద వాలవు. మర్చిపోకు. ఎప్పుడూ ఈ బల్లమీదే ఉంటుందిది."

వంట గదిలోకి వెళ్ళి చైత్ర వంట చేస్తూంటే ఆద్య కునుకు తీసింది. చైత్ర ఓ ట్రేలో ప్లేట్లతో వచ్చింది. దానిమీది రెండు నేప్‌కిన్స్ విసినకర్ర ఆకారంలో మడిచి నిలువుగా స్టాండ్‌లో నిలబడి ఉన్నాయి. చైత్ర నూడుల్స్‌ని చాప్‌స్టిక్స్‌ని ఉపయోగించి తిన్నది. తిన్నాక ఇద్దరికీ ఫ్రిజ్‌లోంచి ఆరెంజ్ జ్యూస్‌ని తెచ్చింది. ఆ తర్వాత లేప్‌టాప్‌ని ఆన్ చేస్తూ చెప్పింది.

“నేను ఆఫీస్ వర్క్ చేసుకుంటాను. నెలాఖరుకు నాకు వర్క్ వత్తిడి ఎక్కువగా ఉంటుంది. ఫైనాన్షియల్, ప్రొడక్షన్ రిపోర్ట్‌లని మా హెడ్ ఆఫీస్‌కి పంపాలి. ఆ సమయంలో వీకెండ్స్ కూడా పనిచేయాల్సి వస్తుంది. రాత్రి ఎనిమిదిన్నరకి అన్నం తిందాం. నువ్వు కాసేపు ప్రశాంతంగా పడుకో."

పడుకున్న ఆద్యలో రకరకాల జ్ఞాపకాలు చెలరేగాయి.

## 10

జినేంద్ర ఓ పార్టీలో తారసపడ్డాడు. ఆ పార్టీలో ఓ ఆట ఆడారు. ఓ మూలనుంచున్న వారివైపు విసిరే బెలూన్లు తమకి తాకకుండా జాగ్రత్తపడుతూ చేతిలోని సూదితో వాటిని పేల్చాలి. పేలకుండా ఒక్కటీ కిందపడకూడదు. జినేంద్ర చివరగా విసిరిన బెలూన్‌ని ఆద్య సూదితో పొడవగానే అందులోని నీలం రంగు నీళ్ళు ఆమె ఒంటిమీదకి వలికాయి. అంతా ఫక్కున నవ్వారు. ఆమె అయిష్టంగానే అతను తెచ్చిన కొత్త డ్రస్‌ని వేసుకుని ఇంటికి వెళ్ళింది.

ఆ తర్వాత మూడోరోజు అతను ఊబర్ కోసం వెయిట్ చేసే ఆమెని పలకరించాడు.

"హలో ఆద్రా."

"హలో" ముభావంగా చెప్పింది.

"డ్రాప్ చేస్తాను. డోంట్ వర్రీ. నువ్వు ఎటెళ్తూంటే అదే నా దారి."

"ఊబర్ ఆన్ ది వే. ఇన్ ఏ మినిట్" చెప్పింది.

"కాని నేను ఛార్జ్ చెయ్యను. నాకి కొత్త లేండ్ రోవర్."

ఆమె మా ట్లాడలేదు. 'ఏమిటి ఇతని ఉద్దేశం?' అనే ఆలోచన కలిగింది.

"కమాన్. ఐ విల్ డ్రాప్ యు."

"నా వెంట ఎందుకు పడుతున్నావో ఫ్రాంక్‌గా చెప్పు" ఆద్య ప్రశ్నించింది.

"అది నువ్వే చెప్పాల్సిన జవాబు. అది అడగడానికే వచ్చాను."

"నేనా? నువ్వా?"

"నువ్వే. ప్రతీ రాత్రి నా కలల్లోకి వచ్చి నన్ను వేధిస్తున్నావు."

ఆమె దూరంగా వచ్చే కారు రంగుని గుర్తుపట్టి, దగ్గరకి రాగనే నంబర్ని చదివి డ్రైవర్‌కి చేతిని ఊపింది. అది వచ్చి ఆమెముందు ఆగింది.

ఆమె టేక్సీ ఎక్కుతూంటే జినేంద్ర అడిగాడు.

"నీ అటెన్షన్‌కోసం తప్పు పేరుతో పలకరించినా కామెంట్ చెయ్యలేదే ఆద్యా?"

ఆమె మౌనంగా తలుపు మూసింది. డ్రైవర్ అడిగిన ఓ.టి.పిని చెప్పింది.

ఆ రాత్రి పడుకున్నాక అలర్ట్ విని చూస్తే జినేంద్రనించి మెసేజ్. 'నీ నిర్లక్ష్యం తలచుకుని ఏడ్చుకుంటూ ఉల్లిపాయని తరుగుతూంటే అది కూడా ఏడ్చింది '

ఆమెకి నవ్వొచ్చింది. 'ఈ ఉల్లిపాయ కంటతడిపెట్టిస్తుంది కాని ఏడవదు. గుడ్ నైట్' జవాబు పంపి పడుకుంది. తర్వాత పంపకుండా ఉండాల్సింది అనుకుంది.

తెల్లారి లేచాక చూస్తే అతన్నించే వచ్చిన ఇంకో మెసేజ్ కనిపించింది.

'ముద్దు వర్షపు చినుకైతే నువ్వు నా దగ్గర తడిసిపోతావు'

'నాకో రెయిన్ కోట్ ఉంది ' జవాబు పంపింది.

ఆ రాత్రి మరో మెసేజ్ గత రాత్రి వచ్చిన సమయానికే వచ్చింది.

'ఒక్క సరైన వర్షపు బిందువు వెయ్యి రెయిన్ కోట్స్‌కి లక్ష చిల్లులు చేయగలదు. అచ్చు, బొమ్మ వేద్దాం.అచ్చు = నువ్వు నా దానివి. బొమ్మ = నేను నీ వాడిని.'

ఆమెకా సంభాషణ సరదాగా తోచడంతో ఓ మెసెజ్ పంపి పడుకుంది. 'తప్పకుండా. అక్బర్ కాలంనాటి నాణెంతో'

ఆ తర్వాత క్రమంగా ఆమె అతని మెసేజెస్‌కోసం చూడసాగింది.

'గత రాత్రంతా నువ్వు నా మెదడులో గడిపినా నాకు విసుగనిపించకపోగా బావుంది.'

'నిన్ను చూసినప్పటినించి ఆనందంగా జీవించడానికి ప్రయత్నిస్తున్నాను. అదెలాగో అర్థమై, నీతో పరిచయంకోసం ప్రయత్నిస్తున్నాను.'

'నాకోసం ఏదైనా చేయగలవా?' మెసేజ్ పంపింది.

'అడిగి చూడు' జవాబు వచ్చింది.

'సరే. మా ఇంట్లోని ఈ చేపల పులుసుని అక్వేరియంగా మార్చు చూద్దాం'

మర్నాడు అదే సమయానికి మరో మెసేజ్ వచ్చింది.

'నువ్వెంత తియ్యనైనదానివంటే, కేడ్‌బరీస్ కంపెనీని దివాలా తీయిస్తావు. నేనా చాక్లెట్లని కొనడం మానేసాను.'

"నా నిక్ నేమ్ సీమ్మిరపకాయ. వాటిని దివాలా తీయించాను.'

ఆ మెసేజెస్ పంపించాక కాలేజీలో అతను తనకి తారసపడితే నవ్వి 'హాయ్' చెప్పేవాడు తప్ప మాట్లాడే ప్రయత్నం చేసేవాడు కాదు. తనకి తెలియకుండానే అతన్ని అబ్జర్వ్ చేసి, అన్నీ ఖరీదైన బ్రాండ్ దుస్తులని, వస్తువులనే వాడతాడని గుర్తించింది.

ఓసారి అతను చైనీస్ రెస్టరెంట్‌కి ఆహ్వానిస్తూ టైమ్ చెప్పాడు. ఆద్య వెళ్ళలేదు. తను అక్కడ ఉండగా రెస్టరెంట్ నేపథ్యంలో కనిపించేలా నిమిషానికో సెల్ఫీ ఫొటోని 'ప్లీజ్' అని పంపసాగాడు. ఆఖరి అరగంట ప్రతీ నిమిషానికి సమయాన్ని తగ్గిస్తూ కౌంట్ డౌన్ పంపాడు. అది ఆద్యని బాగా ఆకర్షించింది. ఈలోగా ఆమె అతని గురించి తనకి పరిచయం చేసిన హవిష్యని అడిగింది. అతను చాలా ధనవంతుడని, ఒక్కడే కొడుకని, తమ కజిన్స్ అందరిలోకీ ఫ్రెండ్లీ, హుషారైనవాడని చెప్పింది.

మర్నాడు కూడా అతన్నించి మరో చైనీస్ రెస్టరెంట్‌కి రమ్మనే అభ్యర్ధన వచ్చింది. ఆమె వెళ్లలేదు. అదే తంతు. అలా మూడుసార్లు జరిగాక నాలుగోసారి అనిపించింది, తనని అతను అంతగా ఆరాధిస్తూంటే ఓసారి వెళ్ళచ్చుగా. తనేం మహారాణా?

అతను కాలేజీలో కనపడి చెప్పాడు.

"నీకు గుడ్‌బై చెప్పడం కష్టం అనిపిస్తోంది బేబీ. అలా అనిపించే వ్యక్తితోనే నువ్వు ప్రేమలో పడ్డట్లు."

మర్నాడు అతన్నించి వచ్చిన మెసేజ్‌లో 'హలో మేగ్నట్. డోంట్ ఎట్రాక్ట్ మీ ' అనే మాటలతో పాటు అతను రెస్టరెంట్‌కి ఆహ్వానించిన టైమ్ కూడా ఉంది. ఇంట్లో అబద్ధం చెప్పి ఆ సమయానికి 'చైనీస్ టీ టాక్' రెస్టరెంట్‌కి వెళ్ళింది. బయట తన కారు బానెట్ మీద కూర్చుని వేచి చూసే అతను దిగి ఆమె దగ్గరకి వేగంగా నడిచి ఆనందంగా ఆమె చేతిని పట్టుకున్నాడు. ఇద్దరూ లోపలికి నడిచారు. అతను చాలా సాధారణ విషయాలు మాట్లాడాడు. తన మొబైల్లో కొందరు రాజకీయ ప్రముఖులు, సినిమా నటీనటులతో తీయించుకున్న ఫోటోలని, సింగపూర్, దుబాయ్, మలేసియా, బేంకాక్‌లాంటి ట్రిప్స్‌కి వెళ్ళినప్పుడూ తీసుకున్న ఫొటోలని చూపించి చెప్పాడు.

"ఈసారి ఫోటోల్లో నువ్వు కూడా ఉండాలి బేబ్."

బేబ్ అన్న మాట వినగానే ఆమెలో అతనిమీద తెలియని అభిమానం కలిగింది. చివర్లో బిల్‌తో ఇచ్చిన చైనీస్ ఫార్చూన్ కుకీలోని మెసేజ్ చదివి ఇద్దరూ నవ్వుకున్నారు.

యు ఆర్ ఎబౌట్ టు ఫినిష్ రీడింగే చైనీస్ కుకీ.

డోంట్ ఈట్ మై స్మాల్ హౌస్.

అతను చిటికేసి వెయిటర్ని పిలిచి మరో అరడజను కుకీలని తెమ్మని కోరాడు. వాటిని ఒకరి తర్వాత మరొకరు విడదీసి అందులోని కాగితం పీలికలని తీసి చదివి నవ్వుకున్నారు.

హెల్ప్. ఐ యాం బీయింగ్ హెల్డ్ ప్రిజనర్ ఇన్ ఏ చైనీస్ కుకీ.

ఏ న్యూ రొమాన్స్ ఈజ్ ఇన్ ది ఆఫింగ్. ఇగ్నోర్ ది ప్రీవియస్ ఒన్.

ప్లీజ్ రిటర్న్ మి టు వెయిటర్. దిస్ హోటెల్ ఈజ్ రన్నింగ్ ఆన్ లాస్.

సారీ ఫర్ ది బ్లాక్ ఇంక్. ఐ వాంటెడ్ గ్రీన్ ఇంక్.

సీ యు హియర్ టుమారో అగైన్.

అతను ఆద్యని ఇంటి దగ్గర దింపాడు. ఇంటికెళ్ళాక మెసేజ్ పంపింది. 'థాంక్స్ ఐ హేడ్ ఏ వండ్రఫుల్ టైమ్'

'అది వండ్రఫుల్‌లో సగభాగం మాత్రమే'

క్రమంగా అతన్నించి మెసేజెస్ అందుకోవడం, అతన్ని కలవడం పెరిగింది. అతను సూటిగా తమ పెళ్ళి గురించి మాట్లాడకపోయినా ఇండైరెక్ట్‌గా అది జరగచ్చని సూచించసాగాడు. తన జీవితం అతని సమక్షంలో అత్యంత సరదాగా, ఆనందంగా సాగుతుందని, అది జరిగి తీరుతుందని కూడా పరిపూర్ణంగా విశ్వసించింది. అందుకు కారణం అతని పుట్టినరోజున జినేంద్ర ఫాం హౌస్‌లో వారంతా కలిసి ఆడిన 'కిస్ మై షాడో ' గేమ్.

ఆ ఆట నియమం, నలుగురు ప్రముఖ యువ సినీ  హీరోల వివరాలని చెప్పగలగాలి. మహేష్‌బాబు అజయ్ అనే పేరుతో ఏ సినిమాలో నటించాడు, అందులోని హీరోయిన్ ఎవరు? సినిమాలో ఆమె పేరేమిటి? లేదా ఆ సినిమాలోని ఓ పాట పల్లవి పాడి వినిపించాలి. దాని సంగీత దర్శకుడి పేరు చెప్పుకోగలగాలి.

ఓడినవారు తమ నీడని ముద్దు పెట్టుకోవాలి. జినేంద్ర వంతు వచ్చింది. అతను ఆద్యని అడిగిన ప్రశ్న, 'మహేష్‌బాబు బిజినెస్‌మేన్‌లోని పాపులర్ పాట చెప్పు.'

'సారొస్తారొస్తారా...' ఆద్య పల్లవి పాడింది.

"తప్పు. దానికన్నా పాపుల ర్పాట ' చావు పిల్లా చావ్ చావ్ ' ఓడిపోయావు."

"అదేం కాదు .నేను ఓడిపోలేదు. సారొస్తారొస్తారానే పాపులర్."

"ఏం కాదు. చావు పిల్లా చావ్ చావ్ మోస్ట్ పాపులర్ పాట."

ఆ విషయంమీద అంతా రెండు వర్గాలుగా విడిపోయి వాదించుకున్నాక జినేంద్ర సూచించాడు.

"సరే.  చావు పిల్లా చావు పాటలో మహేష్‌బాబు డ్రెస్‌లోని ప్రత్యేకత ఏమిటి?"

"కోటు వేసుకున్నాడు."

"తప్పు. ఒకో డ్రస్‌కి ఒకోరకం టైని కట్టుకున్నాడు. కిస్ యువర్ షాడో" జినేంద్ర కొంటెగా చెప్పాడు.

అతను నడిచి ఆమె నీడ తన మొహంమీద పడేలా నుంచున్నాడు. ఎటూ వెళ్ళలేకుండా ఆమె ఆ గది మూల రెండు గోడల మధ్య నిలబడి ఉంది. ఆమె కదిలినప్పుడల్లా అతనూ కదలడంతో అతని మొహం మీది నీడనే ఆమె చుంబించాల్సి

వచ్చింది. ఆమె నిరాకరించడంతో అంతా 'నీడనేగా కిస్ చేసేది? డు ఇట్' అని ప్రోత్సహించారు. ఆమె చటుక్కున అతని పెదవులని స్పృశించి తలని వెనక్కి తీసుకుంది. అంతా చప్పట్లు కొట్టారు.

ప్రేమ మనిషిని మూడు తాపుల్లోంచి తీసుకెళ్తుంది. మూసిన తలపుల్లోంచి, రహస్య తలుపుల్లోంచి, అసలున్నాయనే తెలీని తలుపుల్లోంచి. ఆమె ఆ రాత్రి ఉద్ధృత ఊహల లాహిరిలో తేలిపోయింది.

కాని అతనికి నిశ్చితార్థం జరుగుతోందని హవిష్య వాట్సప్ మెసేజ్ అందుకోగనే ఒక్కసారిగా ఆద్య స్థంభించిపోయింది. ఆమె మెదడు దిమ్మెపోయి, ఏదో కదిలి స్థానభ్రంశం చెందిన భావన తక్షణం కలిగింది.

ఆద్య ఇహంలోకి వచ్చింది. ఆమెని దుఃఖం ఉప్పెనలా కమ్మేసింది.

ఆమె బాధని ప్రయాణ బడలిక ఆక్రమించుకోవడంతో కొద్ది సేపట్లో ఏడుస్తూనే నిద్రలోకి జారిపోయింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**
www.anandbooks.com
www.telugubooks.in